నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 28 సెప్టెంబర్ 2024 | SURYAPET



తమ ఇండ్లు కూల్చొద్దంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్న సూర్యాపేటలోని 42, 43వ వార్డుల ప్రజలు

పేదల నోట్లో మట్టి కొట్టొద్దు..

- మా ఇండ్లు కూల్చొద్దు
- 50 ఏండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం.. అన్ని అనుమతులున్నాయి..
- పైసా పైసా కూడబెట్టి ఇండ్లు కట్టుకున్నాం..
- హైడ్రా సర్వేతో సూర్యాపేటలో పలు కాలనీవాసుల ఆందోళన
- ప్రభుత్వం చెప్పేదొకటి.. చేసేదొకటి అని మండిపాటు

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా సూర్యాపేట జిల్లా కేంద్రంలో కలకలం రేపుతున్నది. చెరువుల పరిధిలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అధికారులు సర్వే చేస్తుండడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నది. గురువారం పలు కాలనీలకు వచ్చిన సర్వే అధికారులకు ప్రజల నుంచి ఎదురు దాడి రావడంతో వెనుదిరిగి వెళ్లారు. కాంగ్రెస్ సర్కారు హైడ్రా హైదరాబాద్‌కే పరిమితమని మొదట చెప్పి ఇప్పుడు జిల్లాలకు తీసుకొస్తున్నది. దాంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 50 ఏండ్లుగా ఆయా చెరువుల సమీప ప్రాంతాల్లో నివాసముంటున్నామని, ఇంటి నంబర్ ఉన్నదని, మున్సిపాల్టీకి పన్ను కడుతున్నామని, ఇన్నేండ్లు సర్వేకు రాని అధికారులు ఇప్పుడెందుకు వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. హైడ్రా తీసుకొచ్చి రేవంత్ సర్కారు పేదల నోట్లో మట్టి కొడుతున్నదని మండిపడుతున్నారు.

నాలుగు రోజులుగా సర్వే

సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత నాలుగు రోజులుగా సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువు, నల్ల చెరువు ప్రాంతాల్లో అధికారులు చేస్తున్న సర్వేతో సమీప ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సద్దుల చెరువు సమీప ప్రాంతాల్లో 200 ఇండ్లను సర్వే చేశారు. ఆయా ప్రాంతాల్లో ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ అధికారుల భాగస్వామ్యంతో సర్వే చేపడుతున్నారు. సర్వే చేస్తున్న అధికారులు ఇంటి నంబర్, ఓనర్ పేరు, ఇల్లు స్వభావం అడిగి తెలుసుకుంటుండడంతో వివరాలు చెప్పకుండా ప్రజలు నిలదీస్తున్నారు. స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో అధికారుల బృందం సర్వే పంథాను మార్చింది. ప్రస్తుతం జనావాసాల్లోకి రాకుండా చెరువు శిఖాల్లో, నివాసాలు లేని ప్రాంతాల్లో సర్వేను కొనసాగిస్తున్నారు. జాతీయ రహదారి వెంట సద్దుల చెరువులో కట్టడాలను పరిశీలించారు. సద్దుల చెరువు సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద ఉన్న చెరువు హద్దు రాయిని గుర్తించారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో పలు వార్డుల గుర్తింపు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో 268 ఎకరాల్లో విస్తరించి ఉన్న సద్దుల చెరువు 247, 800 సర్వే నంబర్ల పరిధిలోకి వస్తుంది. పలు సర్వే నంబర్లలో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు ఉన్నాయి. సద్దుల చెరువు చుట్టు పక్కల 13, 14, 28, 29, 30, 41, 42, 43 వార్డుల్లో ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకోగా 30, 42, 43వ వార్డుల్లో అధికంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

అందరిలో అదే ఆందోళన

హైడ్రా కలకలంతో చెరువుల పరిధిలోని ప్రజలు ఆందోళనలో పడ్డారు. 'మాది చెరువుకు ఇంత దూరంలో ఉంది..అంత దూరంలో ఉంది.. హైడ్రాలో మాది పోతుందా.. మాది పోతుందా? అని చర్చించుకుంటున్నారు. చెరువు నీళ్ల నుంచి 30 మీటర్ల వరకు ఎఫ్‌టీఎల్, ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల వరకు బఫర్ జోన్ అని అధికారులు చెప్తుండడంతో తమ ఇండ్లు ఆ పరిధిలో లేవని కాలనీవాసులు చెప్తున్నారు.

అంతా ఒక్కటై కలెక్టరేట్ వద్దకు వెళ్లిన కాలనీలవాసులు

హైడ్రా సర్వేతో నెహ్రూనగర్, శ్రీశ్రీనగర్, ఇందిరాకాలనీలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున సమావేశమై కలెక్టరేట్ వద్దకు వెళ్లి ధర్నా చేశారు. అధికారులు సర్వే నిలిపివేయాలని, తమ ఇండ్లను కూల్చితే రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా సర్వే నిర్వహిస్తుండడంతో ఇంట్లో పొయ్యి రాజేయడం లేదని, కడుపునిండా తిండి, కంటి నిండ నిద్రకు దూరమై బాధపడుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడే బాగుండేదని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే పేదల గూడును కూలదోస్తున్నారని మండిపడ్డారు. 'మాకు ప్రభుత్వం ఇచ్చే ఏ పథకాలు వద్దు.. మా గూడు మాకు ఉంచితే చాలు' అని వేడుకుంటున్నారు.

మమ్మల్ని చంపి మా ఇల్లు కూల్చండి

నా చిన్ననాటి నుంచి ఇక్కడే ఉంటున్నాం. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగాం. కూలి నాలి చేసుకొని ఇండ్లు కట్టుకున్నాం. చెరువు నిండుకుండలా ఉన్న నాడు కూడా మా ఇండ్లు మునగలేదు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ట్యాంక్ బండ్ కట్టించినప్పుడు కూడా మా జోలికి రాలేదు. 40సంవత్సరాలుగా ఉంటున్నాం, మమ్మల్ని చంపి మా ఇల్లు కూల్చాలి. వయసు పెరుగుతుండడంతో ఇల్లు పోతే ఇప్పుడు మేము ఎటు పోవాలి. ఇంత మందికి ఎక్కడ అద్దెలకు ఇండ్లు దొరుకుతాయి. వచ్చిరాని ప్రభుత్వం వచ్చి మా ఇండ్లు కూల్చుతామంటే ఊరుకునేది లేదు.

- గుంజ జానకమ్మ, శ్రీశ్రీనగర్, సూర్యాపేట

కేసీఆర్ ఉన్నన్ని రోజులు మాకు ఏ ఇబ్బంది లేదు

50 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నాం. నాకు భర్త లేడు. కూలి పనిచేస్తూ చిన్న చిన్న పిల్లలను సాదుకుంటూ ఉన్న ఈ చిన్న గూడుతో జీవనం సాగిస్తున్నాను. కేసీఆర్ సార్ ఉన్నన్ని రోజులు మాకు ఏ ఇబ్బందులు లేవు. ఎన్నో సంక్షేమ పథకాలు ఇచ్చిండు తప్ప ప్రజల నోటికాడి కూడు గుంజలేదు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మాకు ఏమి ఇవ్వకపోగా గూడు కూడా లేకుండా చెయ్యాలని చూస్తుండు. పస్తులున్నా మా ఇంట్లో మేము ప్రశాంతంగా పడుకునేవాళ్లం. కానీ ఇండ్ల కూల్చే కుట్రలు వద్దు.

- రేణుక, నెహ్రూనగర్, సూర్యాపేట

వారం రోజులుగా భయంతో చస్తున్నాం

మా అత్త మామల కాలం నుంచి సుమారు 60 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఇవాళ పోవాలంటే ఎక్కడికి పోవాలి. నా భర్తకు ఆరోగ్యం సరిగా లేదు. నా కుమారుడు చనిపోయిండు. ఎప్పుడూ మా ఇండ్లకు నీళ్లు రాలేదు. కట్ట కట్టిన తరువాత ఇప్పుడు నీళ్లు ఎలా వస్తాయి. తిండి తిప్పలు లేకుంగా వారం రోజులుగా భయంతో చస్తున్నాం. మేం చావాలంటే చెప్పండి. ఒక్కసారే అందరికి విషం సీసాలు ఇచ్చి చంపండి. మంచాన పడ్డ నా భర్తను తీసుకొని ఎక్కడికి పోవాలి ఈ వయసులో. కిరాయిలు కట్టి మేం ఉండలేము. పెద్దలు, నాయకులు మా సమస్యకు పరిష్కారం చూపాలి.

-మక్కల లక్ష్మీశ్రీరాములు, సూర్యాపేట

నా భర్త నిమ్స్‌లో ఉన్నాడు... రాత్రికి రాత్రే వచ్చాను

భర్త అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరిండు. ఇల్లు కూలగొడుతున్నారని సమాచారం తెలుసుకొని హైదరాబాద్ నుంచి నా భర్తను అక్కడే వదిలేసి రాత్రికి రాత్రే వచ్చాను. పది లక్షలు లోన్ తీసుకొని ఇల్లు కట్టాను. ఆరేండ్లుగా లోన్ కడుతున్నా. ఇంకా తొమ్మిదేండ్లు కట్టాల్సి ఉంది. నేను ఏమి చేయాలి. నా పిల్లను ఏం పెట్టి సాదుకోవాలి. నా అరగుంట ఇల్లు తీసేస్తే ఆరోగ్యం బాగా లేని నా భర్తను ఎక్కడికి తీసుకుపోవాలి. ప్రజాప్రతినిధులకు, అధికారులకు దండం పెడుతున్నా.మమ్మల్ని కనికరించి మా ఇల్లులు మాకే ఉంచండి.

- శోభ, నెహ్రూనగర్, సూర్యాపేట

టీఎల్ ఎఫ్, బఫర్ జోన్‌లలో సర్వే చేస్తున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల సమన్వయంతో సద్దుల చెరువు సమీప ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నాం. పాత కాలంలో సద్దుల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి హద్దుల ప్రకారం కట్ట కట్టిన తరువాత కట్ట ఇవతల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎన్ని నివాసాలు ఉన్నాయో సర్వే చేస్తున్నాం. ఈ సర్వేలో ఇంటి నంబర్, ఓనర్ పేరు, ఇల్లు స్వభావం నమోదు చేస్తున్నాం. కేవలం సర్వే మాత్రమే చేయమని చెప్పారు తప్ప కూలగొట్టమనే ఆదేశాలు లేవు. ఇప్పటి వరకు 200 ఇండ్లను సర్వే చేశాం. ప్రజలు ఏదేదో ఊహించుకొని భయపడి ఎదురుదాడికి దిగుతుండడంతో సర్వే ముందుకు సాగడం లేదు.

-భూక్యా పాండునాయక్, ఇరిగేషన్ ఏఈ, సూర్యాపేట

విద్యుత్ ఉద్యోగుల బదిలీలకు ఉత్తర్వులు

నల్లగొండ సిటీ, సెప్టెంబర్ 27 : విద్యుత్ శాఖలో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఆ శాఖ ఉన్నత అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్ శాఖలో 2017 నుంచి పదోన్నతులతోపాటు బదిలీలు పెండింగ్‌లో ఉండటాన్ని కొందరు ఉద్యోగులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సీఎండీ ముషారఫ్ పరూఖీ పదోన్నతులు కల్పిస్తూ రెండు నెలల క్రితం ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతుల ఆధారంగా 2004 జూన్ 30 వరకు ఒకే చోట విధులు నిర్వహిస్తూ రెండు సంవత్సరాలు పూర్తి అయిన ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 28న అర్హులైన వారి జాబితా పూర్తి చేయనున్నారు. దీని ప్రకారం వచ్చే నెల 7 వరకు ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు పూర్తి చేసి 8న బదిలీలు చేపట్టనున్నారు. దీని ప్రకారం ఉద్యోగులు 10 వరకు బదిలీ అయిన స్థానంలో జాయిన్ కావాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

నందికొండ, సెప్టెంబర్ 27 : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నందికొండ హిల్‌కాలనీ విజయవిహార్‌లో పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విజయవిహార్ ప్రాంగణంలో కోలాటం, లంబాడీ నృత్యాలు, బతుకమ్మ ఆటలు నిర్వహించారు. విజయవిహార్ మేనేజర్ కిరణ్, సూపర్ వైజర్ శ్రీధర్, గైడ్లు సత్యనారాయణ, విజయకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిల్‌కాలనీ విజయవిహార్ వద్ద నృత్యాలు చేస్తున్న గిరిజనులు

పోరుబాటలో ట్రిపుల్ ఆర్ బాధితులు

ప్రభుత్వంపై ఒత్తిడి కోసం పోరాటం ఉధృతం

చౌటుప్పల్‌లో ట్రిపుల్ ఆర్ బాధితుల భేటీ

1వ తేదీన చలో ఇందిరాపార్క్‌కు పిలుపు

మరోవైపు న్యాయ పోరాటాలపై దృష్టి

గ్రామాల వారీగా కోర్టు మెట్లు ఎక్కుతున్న బాధితులు

అలైన్‌మెంట్ మార్పు... పరిహారం పెంపు కోసం డిమాండ్

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్27(నమస్తే తెలంగాణ)/చౌటుప్పల్/వలిగొండ : ట్రిపుల్ ఆర్ దక్షిణభాగంలో ఇష్టారాజ్యంగా చేస్తున్న అలైన్‌మెంట్ మార్పులతో పాటు ఉత్తరభాగంలో ఇవ్వజూపుతున్న పరిహారం దేనికి సరిపోదని బాధితులు నిత్యం తమ ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. కొద్దిరోజులుగా పార్టీలకు అతీతంగా ట్రిపుల్ ఆర్‌లో భూములు, ఇండ్లు, ఖాళీ ప్లాట్లు కోల్పోతున్న బాధితులంతా ఒక్కతాటిపైకి వచ్చి పోరుబాట పట్టారు. ఇప్పటికే దశలవారీగా ఎక్కడికక్కడే తమ నిరసన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పులు, ఇవ్వాలనుకుంటున్న పరిహారంపై స్థానిక అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ల దాకా తమ గోడును వెల్లబోసుకున్నారు. అదేవిధంగా అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన రాష్ట్ర నేతలను కలిసి తమ ఆవేదనను విన్నవించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో దక్షిణ, ఉత్తర భాగాలు కలిసే జంక్షన్‌ను ఉన్నట్టుండి పెంచడం వల్ల జరిగే అదనపు నష్టాన్ని వివరిస్తూ తమకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం తరపున తమ గురించి ఆలోచించాలని పలుమార్లు కలిశారు. ట్రిపుల్‌ఆర్‌కు తాము వ్యతిరేకం కాదంటూనే వాస్తవ అవసరాల మేరకే అలైన్‌మెంట్‌ను రూపొందించి అందుకు అనుగుణంగా భూమి సేకరించాలని విజ్ఞప్తి చేశారు. కానీ ప్రభుత్వం వైపు నుంచీ.. అధికార పార్టీ ముఖ్యుల నుంచి కూడా సరైన స్పందన రాకపోవడంతో బాధితులు తమ పోరాటం ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. చౌటుప్పల్‌తో పాటు వలిగొండ మండలంలోని పలు గ్రామాల బాధితులు శుక్రవారం ఐక్యపోరాట వేదిక ఆధ్వర్యంలో చౌటుప్పల్ సమీపంలోని శుభం కన్వెన్షన్‌హాల్‌లో భేటీ అయ్యారు. దీనికి ట్రిపుల్ ఆలైన్‌మెంట్ మార్పు బాధితులతో పాటు తమ భూములు, ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఇందులో ఇప్పటివరకు తాము చేపట్టిన నిరసన, ఆందోళన కార్యక్రమాలపై సమీక్షించుకున్నారు. అయినా సరే ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి సారించాలని నిర్ణయించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చౌటుప్పల్ మున్సిపాలిటీలో జంక్షన్ పరిధి పెరుగకుండా చూడాలని వీలైతే మున్సిపాలిటీ బయట నుంచి అలైన్‌మెంట్ మార్పు కోసం పోట్లాడాలని అనుకున్నారు. దీంతో పాటు అలైన్‌మెంట్‌లో పోతున్న భూములకు, ఇండ్లకు, ప్లాట్లకు పరిహారం కూడా మార్కెట్ రేట్లకు దరిదాపుల్లో ఇచ్చే వరకు పోరాడాలని పేర్కొన్నారు. వాస్తవంగా ఇక్కడ ఒక్కో ఎకరం కోటి రూపాయల నుంచి నాలుగు కోట్ల వరకు ధర పలుకుతున్నది. ప్లాట్ల ధరలు గజం 20వేల నుంచి 30వేల వరకు పలుకుతున్నాయి. కానీ ప్రభుత్వం ఎక్కువలో ఎక్కువగా ఎకరానికి 38లక్షల వరకు పరిహారంగా ఇచ్చే అవకాశాలు ఉన్నట్లుగా అంచనా వేశారు. తక్కువలో అంటే వలిగొండ మండలం వర్కట్‌పల్లి లాంటి చోట్ల ఎకరాకు 26లక్షల వరకు పరిహారం రావచ్చని భావిస్తున్నారు. మార్కెట్ ధరలో కనీసం 30శాతం కూడా పరిహారం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసమే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు.

చౌటుప్పల్‌లో శుక్రవారం ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక సమావేశంలో పాల్గొన్న నాయకులు

న్యాయ స్థానాల్లో కేసులు...

ప్రభుత్వంపై పోరాటాల ద్వారా ఒత్తిడి తెస్తూనే కోర్టుల మెట్లు ఎక్కాలని భావిస్తున్నారు. ఇప్పటికే రాయగిరి రైతులు హైకోర్టులో తమ సమస్యలతో న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు. ఇక తాజాగా వలిగొండ మండలం వర్కట్‌పల్లి రైతులు కొందరు గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. పాత అలైన్‌మెంట్ ప్రకారమే భూములు సేకరించాలని, మార్కెట్ రేట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్న అంశాలతో కోర్టును ఆశ్రయించినట్లు రైతులు వెల్లడించారు. అయితే ఇదే మండలంలోని పహిల్వాన్‌పూర్, రెడ్డరేపాక, ప్రొద్దుటూర్‌లలో త్రీడీ నోటీసులు జారీ చేయగా వర్కుట్‌పల్లి, గోకారం రైతులు నిరాకరించారు. తమ గ్రామాల్లో ట్రిపుల్ సర్వేను సైతం అడ్డుకుంటున్నారు. ఇదే క్రమంలో హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు తెలిసింది. ఇదే విధంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని బాధితులు సైతం లీగల్ పోరాటంపై చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. కొందరు బాధితులు ట్రిపుల్‌ఆర్‌లో తమకున్న భూములు లేదా ఆస్తులను మొత్తంగా ట్రిపుల్‌ఆర్‌లో కోల్పోవాల్సి వస్తుండడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. అందుకే అందరూ కలిసి సమిష్టి పోరాటానికి సిద్ధమైనట్లు ఐక్యవేదిక నేతలు చింతల దామోదర్‌రెడ్డి, బూర్గు కృష్ణారెడ్డి ప్రకటించారు.

1న చలో ఇందిరాపార్క్

అక్టోబర్ 1న భువనగిరి జిల్లా పరిధిలోని ట్రిపుల్‌ఆర్ బాధితులంతా చలో ఇందిరాపార్క్‌కు పిలుపునిచ్చారు. చౌటుప్పల్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన బాధితుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ప్రభుత్వ దృష్టికి వచ్చేలా ఇందిరాపార్క్ వద్ద రోజంతా ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేయాలన్నారు. అయితే చలో ఇందిరాపార్క్‌కు బాధితులంతా తమ కుటుంబసభ్యులతో సహా తరలివచ్చేలా చూడాలని భావిస్తున్నారు. ఈ ధర్నాకు రాష్ట్రంలోని అన్ని పార్టీల ముఖ్య నేతలను ఆహ్వానించాలని కూడా కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రధాన పార్టీల పెద్దలతో పాటు ప్రజాసంఘాల నేతలను సైతం తమకు సంఘీభావం ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వీరంతా వచ్చి తమకు మద్దతు ఇస్తే తమ గోడు ప్రభుత్వం దృష్టికి పోతుందని, తద్వారా తమ ఉపశమనం లభించవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భూమికి భూమి ఇవ్వాలి

ట్రిబుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం భూమికి భూమి ఇచ్చి ఆదుకోవాలి. నాకు ఉన్న వ్యవసాయ భూమిలో రెండున్నర ఎకరాలు రోడ్డుకు పోతున్నది. రెక్కలు ముక్కలు చేసుకొని పైస పైస పోగేసి కొనుకున్న భూమిని రోడ్డు కోసం తీసుకుంటే నాకుటుంబం ఎట్ల బతుకాలే. ప్రభుత్వమే న్యాయం చేసి మమ్ములను ఆదుకోవాలి. రోడ్డుకు ఎంత భూమి పోతే అంత భూమిని ప్రభుత్వం దగ్గర పట్ల ఇయ్యాలె. లేకపోతే మా బతుకులు ఆగమే. ప్రభుత్వం భూమికి భూమి ఇస్తామంటేనే రోడ్డు కోసం భూమిస్తా లేకపోతే ఏ ఒక్క అధికారిని భూమిలోని అడుగుపెట్టనియ్య. ఎంతవరకైనా సరే, కోర్టులో చూసుకుంట.

-మాడ్గుల లచ్చయ్య, రైతు, వర్కట్‌పల్లి, వలిగొండ మండలం

మాకు వ్యవసాయమే ఆధారం

మా ముగ్గురు అన్నదమ్ముళం కలిసి 6 ఎకరాలు కష్టపడి కొనుకున్నం. దాంతో నాలుగున్నర ఎకరాలు పోతున్నది. మాకు వ్యవసాయమే పెద్ద దిక్కు. పంటలు పండించుకునే పిల్లలను చదివించినం. భూమిని నమ్ముకునే ఇన్నాళ్లు బతికినం. మాకు వేరే పని తెల్వదు. ఉన్న భూమి పోతే ఏమి పనిచేయాలి.

-మంద జనార్దన్ రెడ్డి, మందోళ్ల గూడెం, చౌటుప్పల్

హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం

- షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- నార్కట్‌పల్లిలో రైతులతో కలిసి ధర్నా

నార్కట్‌పల్లిలో రైతు ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నార్కట్‌పల్లి, సెప్టెంబర్ 27 : షరతులు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని పోలీస్ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి రైతు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ అంశంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు మంత్రులు తలా ఒక ప్రకటన చేస్తున్నారని, పొంతన లేని మాటలతో రైతులు అయోమయంలో ఉన్నారని అన్నారు. ఇప్పటి వరకు రూ.లక్షలోపు కూడా రుణమాఫీ అందరికీ కాలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. మూడు విడుతల్లో రుణమాఫీ అవుతుందని అనుకున్న రైతులకు చివరికి నిరాశే మిగిలిందన్నారు. ఇకనైనా రైతులకు రుణమాఫీ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని, అర్హులందరికీ రుణమాఫీ చేయకపోతే ఇలాంటి నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, యానాల అశోక్ రెడ్డి, బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, కొండూరి శంకర్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమ కొండ.. లక్ష్మణ్ బాపూజీ

నల్లగొండలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

స్వాతంత్ర్య సమరయోధుడు , తెలంగాణ ఉద్యమకారుడు ,బలహీన వర్గాల సంక్షేమ కోసం పాటుపడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రానికి, ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.

కూలిన ఏఎమ్మార్పీ సిస్టర్న్ గోడ

- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఈ అజయ్‌కుమార్

కూలిన ప్రదేశంలో మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబర్ 27 : ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి సిస్టర్న్ ప్యారపిట్‌వాల్ (పిట్టగోడ) గురువారం రాత్రి కూలింది. వరుసగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న గోడ మట్టి కుంగి 1వ కిలోమీటర్ వద్ద 50 మీటర్ల మేరకు కూలి లోపలి భాగంలో పడిపోయింది. ఇందుకు ప్రధాన కారణంగా ప్రాజెక్టు నిర్మాణంలోని లోపాలేనని తెలుస్తున్నది. గతంలో సిస్టర్న్ నిర్మాణం నాటి నుంచి సిపేజీ(జాలునీరు) లీకేజీ కావడంతో పాటు ఇంటెక్స్ స్ట్రెక్చర్ వద్ద మట్టి కట్ట కుంగింది. అప్పట్లో ఇది రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. తక్షణమే నిపుణుల నివేదిక మేరకు రూ.2కోట్లతో ఇంటెక్ స్ట్రెక్చర్ గ్రౌండింగ్ చేపట్టి మట్టి కట్టకు జేపీ కంపెనీ నిపుణులతో ర్యాక్ ఫిల్‌డ్యామ్ నిర్మించారు. దీంతో కొద్ది రోజుల పాటు ఏఎమ్మార్పీ మూడు మోటార్లే నడుపాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా ప్యారపిట్ వాల్ కూలడంతో ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక చర్యలకు సిద్ధమయ్యారు. శుక్రవారం సీఈ అజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కూలిన ప్రదేశంలో సిమెంట్ బస్తాలను అడ్డుగా వేసి మట్టి కట్ట కూలకుండా తాత్కాలిక మరమ్మతులను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ సత్యనారాయణ, డీఈ నాగయ్య, జేఈ శ్రావణ్ ఉన్నారు.